సాక్షి సంగారెడ్డి

గురువారం । 11 । మే । 2023



ఓఎల్ఎంఎస్‌తో అక్రమాలకు చెక్

ఎరువులు, విత్తనాలు, పురుగు మందుల విక్రయాల్లో అక్రమాలను నివారించడానికి ప్రభుత్వం కొత్తగా ఓఎల్ఎంఎస్ తీసుకొచ్చింది. 8లో



సర్కార్ విద్యార్థుల ప్రభంజనం

పదో తరగతి ఫలితాల్లో ప్రభుత్వ పాఠశాలల విద్యార్థులు ఉత్తమ ఫలితాలు సాధించారు. ఉపాధ్యాయులు, విద్యార్థుల తల్లిదండ్రులు హర్షం వ్యక్తం చేశారు. 9లో

అందరికీ నెగెటివ్

పటాన్‌చెరు టౌన్: పటాన్‌చెరు ప్రభుత్వ ఆస్పత్రిలో కరోనా నిర్ధారణ పరీక్షలు కొనసాగుతున్నాయి. బుధవారం తొమ్మిది కోవిడ్ ర్యాపిడ్ టెస్టులు చేశారు. అందులో అందరికీ నెగెటివ్ వచ్చినట్లు టెస్టుల నిర్వాహకుడు మనోహర్ తెలిపారు. అదేవిధంగా ఆర్టీపీసీఆర్ టెస్టులు పది మందికి చేశామన్నారు.

న్యూస్‌రీల్

ధాన్యం కొనుగోళ్లు వేగవంతం చేయాలి

- రాష్ట్ర కార్మిక సంక్షేమ బోర్డు చైర్మన్ దేవేందర్ రెడ్డి



ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని పరిశీలిస్తున్న రాష్ట్ర కార్మిక సంక్షేమ బోర్డు చైర్మన్ దేవేందర్ రెడ్డి

హత్నూర(సంగారెడ్డి): రైతులు ఇబ్బంది పడకుండా ధాన్యం కొనుగోలు వేగవంతం చేయాలని రాష్ట్ర కార్మిక సంక్షేమ బోర్డు చైర్మన్ దేవేందర్ రెడ్డి అన్నారు. బుధవారం హత్నూర మండలం మంగాపూర్ ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని వ్యవసాయ శాఖ ఏడీఏ ఎండలు, వ్యవసాయ శాఖ అధికారి శ్రీనివాస్‌తో కలిసి సందర్శించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రైతులకు ఇబ్బంది కలగకుండా ధాన్యం కొనుగోలు చేపట్టాలన్నారు. వర్షానికి ధాన్యం తడవకుండా ఉండేందుకు టార్పాలిన్లు కప్పాలన్నారు. ప్రభుత్వం ధాన్యం కొనుగోలు చేస్తుందని, రైతులు అధైర్య పడొద్దన్నారు.

మతోన్మాదాన్ని వ్యతిరేకిస్తేనే దేశానికి భవిష్యత్

- సీఐటీయూ రాష్ట్ర అధ్యక్షుడు చుక్కా రాములు



మాట్లాడుతున్న చుక్కా రాములు

జిన్నారం(పటాన్‌చెరు): మతోన్మాదాన్ని వ్యతిరేకిస్తేనే దేశానికి భవిష్యత్ ఉంటుందని, మతోన్మాదంపై ప్రజలు పోరాటాలు చేయాలని సీఐటీయూ రాష్ట్ర అధ్యక్షుడు చుక్కా రాములు పిలుపు ఇచ్చారు. బుధవారం జిన్నారం మండలం బొల్లారం పారిశ్రామిక వాడలోని ఉత్తముకి పేపర్ పరిశ్రమలో కార్మికులతో సమావేశాన్ని ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ దేశంలో మతోన్మాదం పెరిగిపోతోందన్నారు. మతోన్మాదంతో దేశానికి నష్టం వాటిల్లుతుందన్నారు. దానిని వ్యతిరేకిస్తేనే దేశానికి భవిష్యత్ ఉంటుందన్నారు. కార్మికులకు అండగా సీఐటీయూ ఉంటుందన్నారు. కార్యక్రమంలో జిల్లా అధ్యక్షుడు మల్లేశం, ఉపాధ్యక్షుడు రాజయ్య, నాయకులు మధుసూదన్‌రెడ్డి, శ్రీనివాస్, ప్రభాకర్ తదితరులు పాల్గొన్నారు.

పంటలు నష్టపోయిన రైతులను ఆదుకోవాలి



కాశీపూర్‌లో వరి పంటను పరిశీలిస్తున్న మాజీ ఎంపీ జితేందర్ రెడ్డి తదితరులు

కంది(సంగారెడ్డి): అకాల వర్షాలకు పంటలు నష్టపోయిన రైతులను ప్రభుత్వం ఆదుకోవాలని మాజీ ఎంపీ బీజేపీ నాయకుడు జితేందర్ రెడ్డి డిమాండ్ చేశారు. బుధవారం కంది మండలం కాశీపూర్‌లో వర్షానికి దెబ్బతిన్న వరి, మామిడి పంటను బీజేపీ నాయకులు పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ వర్షాలకు పంటలు దెబ్బతిని రైతులు నష్టపోయారన్నారు. ప్రభుత్వం దెబ్బతిన్న పంటల సర్వే చేసి రైతులకు పరిహారం అందజేసి ఆదుకోవాలన్నారు. కార్యక్రమంలో బీజేపీ జిల్లా అధ్యక్షుడు నరేందర్ రెడ్డి, పలువురు నాయకులు పాల్గొన్నారు.

దరఖాస్తుల ఆహ్వానం

సంగారెడ్డి టౌన్ : రేప్యూటెడ్ ప్రైవేట్ జూనియర్ కళాశాలల ప్రవేశాల కోసం దరఖాస్తులు స్వీకరిస్తున్నట్లు బీసీ అభివృద్ధి శాఖ అధికారి జగదీష్ బుధవారం తెలిపారు. 2023–24 విద్యా సంవత్సరానికి ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనార్టీ, పీహెచ్‌సీ, ఈబీసీ విద్యార్థులు ప్రైవేట్ జూనియర్ కళాశాలల్లో ప్రవేశాలు కల్పించాలన్నారు. జిల్లాలోని ప్రైవేట్ పాఠశాలల నుంచి ఈ పథకం కింద ఆసక్తిగల ప్రైవేట్ రికగ్నైజేషన్ ప్రైవేట్ జూనియర్ కళాశాల యాజమాన్యాలు, రెన్యూవల్ కళాశాలు కార్పొరేట్ కళాశాల స్కీమ్ కింద https://telanganapass.cgg.gov.in ద్వారా దరఖాస్తులు స్వీకరించాలన్నారు. ఆసక్తిగల అభ్యర్థులు ఈనెల 15వ తేదీ వరకు పూర్తి సర్టిఫికెట్లతో కార్యాలయంలో సంప్రదించాలన్నారు.

పదిలో మూడో స్థానం



- కొనసాగిన బాలికల హవా
- గురుకులాల్లో 99 శాతం ఉత్తీర్ణత

ఉత్తీర్ణత శాతం		
గతేడాది	96.75%	రాష్ట్రంలో: 3వ స్థానం
ఈ సంవత్సరం	97.29 %	రాష్ట్రంలో: 3వ స్థానం



వంద శాతం ఫలితాలు సాధించిన గిర్మాపూర్ గురుకుల పాఠశాల

కొండాపూర్(సంగారెడ్డి): పదో తరగతి ఫలితాల్లో మరోసారి బాలికలు సత్తా చాటారు. బుధవారం విడుదలైన పదో తరగతి ఫలితాల్లో సంగారెడ్డి జిల్లా 97.29 శాతం సాధించి రాష్ట్ర స్థాయిలో మూడో స్థానంలో నిలిచింది. గత సంవత్సరం కూడా 96.75 ఉత్తీర్ణత శాతంతో మూడో స్థానంలోనే నిలిచింది. జిల్లా వ్యాప్తంగా 21, 358 మంది విద్యార్థులకు గాను 20,780 మంది ఉతీర్ణులయ్యారు. వీరిలో బాలురు 10,713 మందికి 10,367 మంది ఉత్తీర్ణులు కాగా, 346 మంది విద్యార్థులు ఫెయిలయ్యారు. బాలుర ఉత్తీర్ణత శాతం 96.77 గా నమోదైంది. అదేవిధంగా బాలికలు 10,645 మంది విద్యార్థినులకు 10,413 మంది ఉత్తీర్ణత సాధించగా, 232 మంది ఫెయిలయ్యారు. బాలికల ఉత్తీర్ణత శాతం 97.82గా నమోదైంది. జిల్లా వ్యాప్తంగా 272 పాఠశాలలో వంద శాతం ఫలితాలు వచ్చాయి. వీటిలో 94 జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలు, ఆదర్శ పాఠశాలలు 7, కేజీబీవీలు 9, ప్రైవేట్ పాఠశాలలు, ప్రైవేట్ పాఠశాలలు 125, టీఎస్ రెసిడెన్షియల్ 2, బీసీ వెల్ఫేర్ 9, సోషల్ వెల్ఫేర్ 9, ట్రైబల్ వెల్ఫేర్ 5, ట్రైబల్ వెల్ఫేర్ ఆశ్రమం 2, మైనార్టీ గురుకుల పాఠశాలలు 9 ఉన్నాయి. జిల్లా వాప్తంగా 370 మంది విద్యార్థులు 10 జీపీఏ సాధించారు.

- బుధవారం విడుదలైన పదో తరగతి ఫలితాల్లో గురుకుల విద్యార్థులు ప్రభంజనం సృష్టించారు. జిల్లా వ్యాప్తంగా 857 మంది విద్యార్థులు పరీక్షలు రాయగా 856 మంది ఉత్తీర్ణత సాధించగా, ఒక విద్యార్థి మాత్రమే ఫెయిలయ్యాడు. జిల్లా వ్యాప్తంగా ఉన్న 11 గురుకులాలకు గానూ ఇస్నాపూర్ గురుకుల పాఠశాలలో మాత్రమే ఒక విద్యార్థి ఫెయిలయ్యాడని, మిగతా పది గురుకుల పాఠశాలలు వంద శాతం ఉత్తీర్ణత సాధించాయి. ఈ ఫలితాలపై గురుకులాల ఆర్‌సీఓ భీమయ్య హర్షం వ్యక్తం చేశారు.
- మహాత్మ జ్యోతి బాపూలే గురుకుల పాఠశాల విద్యార్థులు ఫలితాల్లో సత్తా చాటారు. జిల్లా వ్యాప్తంగా 10 గురుకులాలకు సంబంధించి 654 మంది పరీక్షలు రాయగా 650 మంది విద్యార్థులు ఉత్తీర్ణులయ్యారు. నలుగురు ఫెయిలయ్యారు. జిల్లా వ్యాప్తంగా 21 మంది 10 జీపీఏ సాధించారు.
- జిల్లాలోని 17 కస్తూర్బా గాంధీ బాలికల పాఠశాలలకు సంబంధించి 633 మంది విద్యార్థులకు గాను 607 మంది విద్యార్థులు ఉత్తీర్ణత సాధించారు. అందోల్, ఝరాసంగం, జిన్నారం, పుల్‌కల్, రాయికోడ్ , కొండాపూర్, పుల్‌కుర్తి పాఠశాలలు వంద శాతం ఫలితాలు సాధించాయి. పుల్‌కుర్తి కస్తూర్బా పాఠశాలలో విద్యార్థిని మధు 10 జీపీఏ సాధించింది.



ఝాన్సీ (10 జీపీఏ) పోతిరెడ్డిపల్లి జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల

- ఆదర్శ పాఠశాలలకు సంబంధించి 10 పాఠశాలలో 953 మంది విద్యార్థులు పరీక్షలు రాయగా 941 మంది విద్యార్థులు ఉత్తీర్ణత సాదించారు. వీటిలో 7 పాఠశాలలు వంద శాతం ఉత్తీర్ణత సాదించాయి. వీరిలో 10 మంది విద్యార్థులు 10 జీపీఏ సాదించారు.
- మైనార్టీ గురుకుల పాఠశాలకు సంబంధించి 12 పాఠశాలలో 678 మంది విద్యార్థులు పరీక్షలు రాయగా 671 మంది విద్యార్థులు ఉత్తీర్ణత సాధించారు, 12 పాఠశాలలకుగాను 9 పాఠశాలలు వంద శాతం ఫలితాలు సాధించాయి. వీరిలో ఆరుగురు 10 జీపీఏ సాధించారు.

నేడు బీజేపీ నిరుద్యోగ మార్చ్

- హాజరుకానున్న పార్టీ చీఫ్ బండి సంజయ్
- తరలిరానున్న ఉమ్మడి జిల్లా పార్టీ శ్రేణులు

సాక్షి ప్రతినిధి, సంగారెడ్డి: టీఎస్‌పీఎస్‌సీ ప్రశ్నాపత్రాల లీకేజీని నిరసిస్తూ బీజేపీ రాష్ట్ర నాయకత్వం గురువారం సంగారెడ్డిలో నిరుద్యోగ మార్చ్ కార్యక్రమాన్ని నిర్వహించనుంది. ఈ కార్యక్రమానికి ఆ పార్టీ రాష్ట్ర అధ్యక్షుడు బండి సంజయ్‌తో పాటు పలువురు రాష్ట్ర నాయకులు రానున్నారు. ఇప్పటికే వరంగల్, మహబూబ్‌నగర్ జిల్లా కేంద్రాల్లో నిరుద్యోగ మార్చ్ నిర్వహించారు. ఉమ్మడి మెదక్ జిల్లాకు సంబంధించిన నిరుద్యోగ మార్చ్‌ను సంగారెడ్డిలో నిర్వహిస్తున్నారు. కార్యక్రమానికి సంగారెడ్డి జిల్లాతో పాటు, మెదక్, సిద్దిపేట జిల్లాల నుంచి పార్టీ శ్రేణులు, నిరుద్యోగ యువత తరలివస్తారని బీజేపీ నాయకులు పేర్కొన్నారు. గురువారం సాయంత్రం 4 గంటలకు సంగారెడ్డిలో ఐబీ నుంచి ప్రారంభమై రాత్రి 8 గంటలకు పోత్తిరెడ్డి పల్లి చౌరస్తా వరకు నిరుద్యోగ మార్చ్ కొనసాగుతుంది. కార్యక్రమానికి బీజేపీ రాష్ట్ర వ్యవహారాల ఇన్‌చార్జి తరుణ్‌చుగ్ హాజరయ్యే అవకాశాలున్నాయని పార్టీ వర్గాలు పేర్కొన్నాయి.

సుమారు 20 వేల మందితో..

నిరుద్యోగ మార్చ్ కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని పార్టీ జిల్లా నేతలు పిలుపునిచ్చారు. కనీసం 20 వేల మందితో నిరుద్యోగ మార్చ్ నిర్వహించాలని భావిస్తున్నారు. ఇందు కోసం ఆయా నియోజకవర్గాల వారీగా పార్టీ శ్రేణులను తరలించాలనుకుంటున్నారు. జిల్లాలో ఇటీవల జరిగిన పార్టీ ముఖ్య కార్యక్రమాలు విఫలం కావడం తీవ్ర విమర్శలకు దారితీసింది. కందిలో పార్టీ జిల్లా కార్యాలయం ప్రారంభోత్సవ కార్యక్రమం నిర్వహణ అస్తవ్యస్తంగా జరగడంతో జిల్లా నాయకత్వంపై రాష్ట్ర ముఖ్యనేతలు తీవ్ర స్థాయిలో మండిపడినట్లు పార్టీ వర్గాలు చర్చించుకుంటున్నాయి. ఈ నేపథ్యంలో గురువారం జరగనున్న నిరుద్యోగ మార్చ్ కార్యక్రమాన్ని ఎలాగైనా విజయవంతం చేయాలని ఆ పార్టీ భావిస్తోంది.

పర్యావరణాన్ని పరిరక్షించండి



ర్యాలీని ప్రారంభిస్తున్న హన్మంత్‌రెడ్డి

- పీసీబీ జాయింట్ చీఫ్ ఎన్విరాన్‌మెంటల్ ఇంజినీర్ హన్మంత్‌రెడ్డి

జిన్నారం(పటాన్‌చెరు): పర్యావరణాన్ని పరిరక్షణలో అందరూ భాగస్వాములు కావాలని పీసీబీ జాయింట్ చీఫ్ ఎన్విరాన్‌మెంటల్ ఇంజినీర్ హన్మంత్‌రెడ్డి పిలుపునిచ్చారు. పర్యావరణ హిత జీవన శైలి కార్యక్రమంలో భాగంగా బుధవారం జిన్నారం మండలంలోని ఖాజీపల్లి, గడ్డపోతారం పారిశ్రామిక వాడల్లో అవగాహన కార్యక్రమాన్ని చేపట్టారు. ప్రకృతికి హాని కలుగకుండా తీసుకోవాల్సిన చర్యలు, ప్లాస్టిక్ నివారణ, మొక్కల పెంపకం, నీటి సంరక్షణ అంశాలపై ప్రజలకు అవగాహన కల్పించారు. పారిశ్రామిక వాడల్లోని గ్రామాల్లో ర్యాలీ చేపట్టారు. ఈ సందర్భంగా హన్మంత్‌రెడ్డి మాట్లాడుతూ పర్యావరణ పరిరక్షణ అందరి బాధ్యత అన్నారు. కేంద్ర ప్రభుత్వం చేపడుతున్న పర్యావరణహిత జీవన శైలి కార్యక్రమం ద్వారా ప్రజలకు అవగాహన కల్పించే కార్యక్రమాలను దశలవారీగా చేపడుతామన్నారు. అనంతరం ఆయా పరిశ్రమల్లో మొక్కలను నాటారు. కార్యక్రమంలో పీసీబీ ఈఈ కుమార్ పాఠక్, సర్పంచ్‌లు ప్రకాశ్‌చారి, చిట్ల సత్యనారాయణ, సోషల్ సైంటిస్ట్ శ్రీనివాస్, అసిస్టెంట్ ఎన్విరాన్‌మెంట్ సైంటిస్ట్ రవీందర్, మోడల్ ఇండస్ట్రియల్ అసోసియేషన్ అధ్యక్షుడు మూర్తి, సెక్రటరీ శ్రీధర్, ఆయా పరిశ్రమల ప్రతినిధులు మోహన్ రెడ్డి, సుదీప్తి, శేఖర్, హరిబాబు, రవిశంకర్‌రెడ్డి, అశోక్ తదితరులు పాల్గొన్నారు.

విద్యార్థినికి ప్రతిభా అవార్డు అందజేత



విద్యార్థినిని అభినందిస్తున్న మంత్రి కమలాకర్

రాయికోడ్(అందోల్): మండలంలోని సింగితం గ్రామానికి చెందిన శ్రీనివాస్ కూతురు వైష్ణవి ఇంటర్ ఎంపీసీ మొదటి సంవత్సరంలో 470 మార్కులకు గాను 466 మార్కులు సాధించింది. విద్యార్థిని సరూర్‌నగర్‌లోని మహాత్మా జ్యోతిరావు పూలే చదువుతుండగా రాష్ట్ర స్థాయిలో మూడో ర్యాంకు సాధించింది. విద్యార్థిని ప్రతిభను గుర్తించి హైదరాబాద్‌లోని సచివాలయంలో బీసీ సంక్షేమ శాఖ మంత్రి గంగుల కమలాకర్ బుధవారం ప్రతిభ అవార్డు అందజేసి అభినందించారు. సాంఘిక సంక్షేమ శాఖ కార్యదర్శి మల్లయ్య బట్టు విద్యార్థినిని అభినందించి భవిష్యత్‌లో మరింత ప్రతిభ చాటాలని ఆకాంక్షించారు.

ఓడీఎఫ్‌లో ఉత్పత్తి పెంచాలి

ఓబీసీ జాతీయ కమిషన్ చైర్మన్‌కు వినతి



పుష్పగుచ్ఛం ఇస్తున్న నాయకులు

సంగారెడ్డి మున్సిపాలిటీ: ఓడీఎఫ్‌లో ఉత్పత్తి పెంచి, బీసీ గణన వెంటనే చేపట్టాలని ఓబీసీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి తాటిపల్లి పాండు డిమాండ్ చేశారు. బుధవారం ఓబీసీ జాతీయ కమిషన్ చైర్మన్ హన్సరాజ్ గంగారాం అహిర్‌తో హైదరాబాద్ బేగంపేట హరితప్లాజాలో వివిధ కేంద్ర ప్రభుత్వ రంగ సంస్థలలో అమలవుతున్న రిజర్వేషన్ విధానాన్ని సమీక్ష జరిగిందన్నారు. ఈ సందర్భంగా పాండు మాట్లాడుతూ ఆర్డినెన్సు ఫ్యాక్టరీ నుంచి సీజీఎం సుధాకర్, లైజన్ ఆఫీసర్ వేణునాథ్, అడ్మిన్ ఆఫీసర్ కేసీ మోహన్, ఎస్టాబ్లిషమెంట్ ఎల్బీ స్టాఫ్ మాట్లాడారన్నారు. అనంతం ఓబీసీ అసోసియేషన్ కార్యవర్గం కమిషన్ చైర్మన్‌ను కలిసి వినతిపత్రం ఇచ్చామన్నారు. జహీరాబాద్ ఎంపీ బీబీ పాటిల్‌ను కలిసి మెదక్ ఆర్డినెన్సు ఫ్యాక్టరీలో ఉత్పత్తి పెంచాలని, ఉద్యోగుల హక్కులు కాపాడాలని, ఉద్యోగులను కేంద్ర ప్రభుత్వ ఉద్యోగులుగానే ఉంచాలని కోరామన్నారు. రక్షణ శాఖ మంత్రితో మాట్లాడి సమస్య పరిష్కరానికి కృషి చేస్తానని హామీ ఇచ్చారన్నారు. కేంద్ర ప్రభుత్వం వెంటనే కులగణన చేయాలని డిమాండ్ చేశారు. ప్రమోషన్లలో రిజర్వేషన్ కల్పించాలని, క్రీమీలేయరు పరిమితి రూ.15 లక్షలకు పెంచాలన్నారు. కేంద్రంలో ఓబీసీ మంత్రిత్వ శాఖ ఏర్పాటు చేయాలని కోరారు. కార్యక్రమంలో పాండు, అశోక్, ప్రభు, వీరేశం, అనురాధ, అశోక్, శివకుమార్ పాల్గొన్నారు.

జేపీఎస్‌ను రెగ్యులరైజ్ చేయాలి

సీఐటీయూ జిల్లా కార్యదర్శి సాయిలు



సమావేశంలో మాట్లాడుతున్న సీఐటీయూ జిల్లా కార్యదర్శి సాయిలు

కొండాపూర్(సంగారెడ్డి): జూనియర్ పంచాయతీ కార్యదర్శులను ప్రభుత్వం తక్షణమే క్రమబద్ధీకరించాలని సీఐటీయూ జిల్లా కార్యదర్శి సాయిలు డిమాండ్ చేశారు. బుధవారం జిల్లా కేంద్రమైన సంగారెడ్డిలోని సుందరయ్య భవన్‌లో కార్మిక, ప్రజా సంఘాల ఆధ్వర్యంలో రౌండ్ టేబుల్ సమావేశం జరిగింది. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ జూనియర్ పంచాయతీ కార్యదర్శులు న్యాయమైన డిమాండ్ కోసం 12 రోజులుగా సమ్మె చేస్తున్నా ప్రభుత్వం పరిష్కరించకుండా బెదిరించడం సరికాదన్నారు. జేపీఎస్‌లను క్రమబద్ధీకరించడంతో పాటు ఉద్యోగ భద్రత కల్పించాలని, ఔట్ సోర్సింగ్ ఉద్యోగులను పంచాయతీ కార్యదర్శులుగా గుర్తించాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో సీఐటీయూ జిల్లా సహాయ కార్యదర్శి సురేశ్, రైతు సంఘం జిల్లా అధ్యక్షుడు రాజయ్య, కేవీపీఎస్ జిల్లా అధ్యక్షుడు అశోక్, ఎస్ఎఫ్ఐ జిల్లా కార్యదర్శి రమేశ్, యుబీ నిజాం యూనియన్ జనరల్ సెక్రటరీ ప్రవీణ్, రైతు సంఘం జిల్లా ఉపాధ్యక్షుడు యాదవ రెడ్డి, కేవీపీఎస్ జిల్లా సహకార దర్శి రాంచందర్ తదితరులు పాల్గొన్నారు.

జర్మనీలో ఉద్యోగ అవకాశాలు

సంగారెడ్డిటౌన్: జర్మనీలో సాఫ్ట్‌వేర్ డెవలపర్, సాఫ్ట్‌వేర్ ఇంజనీర్, సిస్టమ్ అడ్మినిస్ట్రేటర్‌లు, ప్రాజెక్టు మేనేజర్లు, కన్సల్టెంట్లు, ఈఆర్పీ, ఐటీ సపోర్ట్ తదితర ఉద్యోగాలకు అర్హత గల అభ్యర్థులు టామ్ కామ్ వెబ్‌సైట్‌లో నమోదు చేసుకోవాలని కలెక్టర్ డాక్టర్ శరత్ బుధవారం తెలిపారు. అభ్యర్థులకు సంబంధిత రంగంలో 3 నుంచి 5 సంవత్సరాల అనుభవం కలిగి ఉండాలన్నారు. డిగ్రీతోపాటు జర్మన్ భాషలో ప్రావీణ్యంగల అభ్యర్థులు అర్హులన్నారు. అర్హత గల అభ్యర్థులు టామ్ కామ్ వెబ్ సైట్ లేదా మొబైల్ యాప్‌లో నమోదు చేసుకోవాలని, లేదా తమ రెజ్యూమ్ tomcom.itcordinator@gmail.com కు ఈ మెయిల్ చేయాలని సూచించారు.

ప్రవేశ పరీక్ష ప్రశాంతం

కొండాపూర్(సంగారెడ్డి): మహాత్మ జ్యోతి బాపూలే గురుకుల పాఠశాలలో 6, 7, 8వ తరగతిలలో బ్యాక్‌లాగ్ సీట్ల భర్తీ కోసం నిర్వహించిన ప్రవేశ పరీక్ష ప్రశాంతంగా జరిగింది. ఈ పరీక్షలకు 2604 మంది విద్యార్థులకు గానూ 2310 మంది హాజరయ్యారు. 294 మంది గైర్హాజరయ్యారు. హాజరు శాతం 88.71 నమోదైనట్లు ఆర్‌సీఓ ప్రభాకర్ తెలిపారు.

గురుకుల ఉపాధ్యాయ ఉద్యోగాలకు ఉచిత శిక్షణ

సంగారెడ్డి మున్సిపాలిటీ: సంగారెడ్డి పట్టణంలోని టీఎస్ బీసీ స్టడీ సర్కిల్‌లో గురుకుల ఉపాధ్యాయుల ఉద్యోగాలకు ఉచిత శిక్షణ ఇవ్వనున్నట్లు బీసీ స్టడీ సర్కిల్ నిర్వాహకులు బుధవారం తెలిపారు. అనుభవజ్ఞులైన అధ్యాపకులతో 75 రోజులు ఉచిత శిక్షణతోపాటు స్టడీ మెటీరియల్ అందజేస్తారన్నారు. శిక్షణకు డిగ్రీతో పాటు, బీఎడ్ పూర్తి చేసిన అభ్యర్థులకు అర్హులన్నారు. అభ్యర్థుల తల్లిదండ్రుల వార్షిక ఆదాయం రూ.5 లక్షలలోపు ఉండాలన్నారు. శిక్షణకు సంగారెడ్డి, మెదక్ జిల్లా అభ్యర్థులు అర్హులు స్పష్టంగా పేర్కొన్నారు. ఆన్‌లైన్‌లో ఈనెల 12 నుంచి 25 వరకు దరఖాస్తు చేసుకోవాలని వెల్లడించారు. జూన్ 1 నుంచి ప్రారంభమవుతుందన్నారు. బీసీలు 75, ఎస్సీలు 15, ఎస్టీలు 5, ఇతరులకు 5 శాతం కేటాయించినట్లు తెలిపారు. వివరాలకు http://tsbcstudycircle.cgg.gov.in వెబ్‌సైట్ సందర్శించాలని, 08455–277015 నంబర్‌కు ఫోన్‌చేసి తెలుసుకోవాలన్నారు.

సేంద్రియ సాగుతో మేలు



రైతులకు అవగాహన కల్పిస్తున్న శాస్త్రవేత్తలు

ఝరాసంగం(జహీరాబాద్): రైతులు సేంద్రియ ఎరువులతో పంటలు సాగు చేస్తే భూమి ఆరోగ్యంగా ఉంటుందని డీడీఎస్–కేవీకే శాస్త్రవేత్తలు పేర్కొన్నారు. బుధవారం మండల పరిధిలోని పొట్టిపల్లి గ్రామంలో సేంద్రియ ఎరువులు, కషాయాల తయారీ విధానం, సాగులో వినియోగించే పద్ధతులపై అవగాహన కల్పించారు. అనంతరం వారు మాట్లాడుతూ సేంద్రియ ఎరువులతో పంటలు సాగుచేస్తే మంచి దిగుబడులు పొందవచ్చన్నారు. అంతేకాకుండా పర్యావరణాన్ని, భూసారాన్ని పరిరక్షించుకోవచ్చన్నారు. జీవామృతం, ఘనజీవామృతం, పంచగవ్య తయారీ విధానంతో పాటు ఎంత మేరకు పోషకాలు లభిస్తాయి, ఎంత మేర వినియోగించాలి తదితర అంశాలపై అవగాహన కల్పించారు. సేంద్రియ పద్ధతులలో దశపర్ని కషాయంతో చీడపీడలను నివారించుకోవచ్చన్నారు. కార్యక్రమంలో శాస్త్రవేత్తలు స్వామి, స్నేహలత, సూపర్‌వైజర్ బాలన్న, నర్సమ్మ, మంజులమ్మ, ఝరాసంగం, న్యాల్‌కల్, జహీరాబాద్ మండలాల్లోని వివిధ గ్రామాల రైతులు పాల్గొన్నారు.

బీదర్ జిల్లాలో ఎన్నికలు ప్రశాంతం



బీదర్‌లో ఓటు హక్కు వినియోగించుకున్న కేంద్ర మంత్రి భగవంత్ కుబా

జహీరాబాద్: జహీరాబాద్ పక్కనే ఉన్న కర్ణాటకలోని బీదర్ జిల్లాలో బుధవారం అసెంబ్లీ ఎన్నికలు ప్రశాంతంగా జరిగాయి. జిల్లాలోని బీదర్ ఉత్తర, బీదర్ దక్షిణ, ఔరాద్, హుమ్నాబాద్, బస్వకళ్యాణ్, బాల్కి అసెంబ్లీ స్థానాలకు ఎన్నికలు జరిగాయి. సాయంత్రం 5 గంటల వరకు 60 శాతం మేర పోలింగ్ జరిగింది. 6 గంటల వరకు ఓటర్లు బారులు తీరారు. పోలింగ్ సందర్భంగా ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు జరగలేదు. పోలింగ్‌ను కేంద్ర మంత్రి భగవంత్ కుబా, రాష్ట్ర పశు సంవర్ధక శాఖ మంత్రి ప్రభు చౌహాన్, ఆయా నియోజకవర్గాల ఎమ్మెల్యేలు బండెప్ప కాశీంపూర్, ఈశ్వర్ ఖండ్రె, శరణు సల్గార, రాజశేఖర్ పాటిల్, రహీంఖాన్ పర్యవేక్షించారు.

పనులు త్వరగా పూర్తిచేయాలి



పనులను పరిశీలిస్తున్న డీఈఓ వెంకటేశ్వర్లు

రామచంద్రాపురం(పటాన్‌చెరు): పట్టణంలోని జిల్లా పరిషత్ పాఠశాలను గురువారం జిల్లా విద్యాధికారి వెంకటేశ్వర్లు సందర్శించారు. ఈ సందర్భంగా మన ఊరు –మనబడిలో భాగంగా పాఠశాలలో జరుగుతున్న పనులను పరిశీలించారు. అనంతరం డీఈఓ మాట్లాడుతూ జూన్ 30వ తేదీ లోపు అసంపూర్తిగా ఉన్న పనులను పూర్తి చేయాలని సూచించారు. కార్యక్రమంలో ఎంఈఓ జెమిని కుమారి తదితరులు పాల్గొన్నారు.

క్లుప్తంగా

ఖేడ్‌ను సందర్శించిన ఎస్పీ

నారాయణఖేడ్: ఎస్పీ రమణకుమార్ బుధవారం నారాయణఖేడ్‌ను సందర్శించారు. ఈ సందర్భంగా ఆయన సర్కిల్ కార్యాలయం, పోలీస్‌స్టేషన్‌ను తనిఖీ చేశారు. అనంతరం పలు రికార్డులను పరిశీలించారు. శాంతిభద్రతల పరిస్థితిని సమీక్షించారు. ఆయన వెంట డీఎస్పీ వెంకట్‌రెడ్డి, సీఐ రామకృష్ణారెడ్డి, ఎస్‌ఐ వెంకట్‌రెడ్డి ఉన్నారు.

గుర్తుతెలియని మృతదేహం లభ్యం

సంగారెడ్డి టౌన్: గుర్తుతెలియని మృతదేహం లభ్యమైన సంఘటన బుధవారం సంగారెడ్డి రూరల్ పోలీస్‌స్టేషన్ పరిధిలో చోటుచేసుకుంది. రూరల్ పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం..పోతిరెడ్డి పల్లిలోని జనప్రియ హోటల్ వెనకాల మృతదేహం ఉందని స్థానికులు ఇచ్చిన సమాచారంతో అక్కడ వెళ్లినట్లు చెప్పారు. మృతదేహాన్ని సంగారెడ్డి ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారన్నారు. ఎవరైనా ఆచూకీ తెలిస్తే 871256746, 8919785080 నెంబర్లకు సంప్రదించాలని రూరల్ పోలీసులు తెలిపారు.

సైబర్ వలలో సీనియర్ సిటిజన్

పటాన్‌చెరు టౌన్: సైబర్ వలలో సీనియర్ సిటిజన్ రూ. లక్ష 39 వేలు పోగొట్టుకున్న సంఘటన అమీన్‌పూర్ పోలీస్ స్టేషన్ పరిధిలో చోటుచేసుకుంది. పోలీసుల కథనం ప్రకారం.. అమీన్‌పూర్ పరిధిలోని శంకర్ గ్రీన్ హోమ్స్‌కు చెందిన ఓ సీనియర్ సిటిజన్ ఈ నెల 8వ తేదీన ఆన్‌లైన్‌లో కెమెరా బుక్ చేశాడు. బుక్ చేసిన కెమెరా రాకపోవడంతో 9వ తేదీన ఆన్‌లైన్ బుక్కింగ్‌కు సంబంధించి గూగుల్‌లో సెర్చ్ చేయగా ఓ టోల్ ఫ్రీ నెంబర్ దొరికింది. ఈ క్రమంలో సీనియర్ సిటిజన్ ఆ నెంబర్‌కు ఫోన్ చేసి కెమెరాకు చెల్లించిన నగదు తిరిగి ఇవ్వాలని కోరాడు. గుర్తు తెలియని వ్యక్తి అడిగిన విధంగా బ్యాంక్ ఖాతా వివరాలను సీనియర్ సిటిజన్ వెల్లడించాడు. దీంతో 9 దఫాలుగా సీనియర్ సిటిజన్ ఖాత నుంచి రూ. లక్ష 39వేలు పోగొట్టుకున్నాడు. ఈ విషయంలో తను మోసపోయినట్లుగా గుర్తించి పటాన్‌చెరు పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేశాడు.

గీత కార్మికుడికి గాయాలు

చేర్యాల(సిద్దిపేట): తాటి చెట్టు పైనుంచి పడి గీత కార్మికుడికి గాయాలైన ఘటన మండల పరిధిలోని వేచరేణి గ్రామంలో బుధవారం చోటు చేసుకుంది. స్థానికులు తెలిపిన వివరాల ప్రకారం..గ్రామానికి చెందిన బూరుగు కిష్టయ్య రోజు మాదిరిగా తాటి చెట్టు ఎక్కే క్రమంలో ప్రమాదవశాత్తు పై నుంచి కింద పడి గాయపడ్డాడు. విషయం తెలుసుకున్న స్థానికులు చికిత్స నిమిత్తం స్థానిక ఆసుపత్రికి తరలించారు. కుటుంబ సభ్యులు వైద్యుల సూచన మేరకు మెరుగైన వైద్యం నిమిత్తం హైదరాబాద్ తరలించారు.

చికిత్స పొందుతున్న వ్యక్తి మృతి

సిద్దిపేట కమాన్: చికిత్స పొందుతున్న వ్యక్తి మృతి చెందిన సంఘటన సిద్దిపేట టూటౌన్ పరిధిలో బుధవారం చోటు చేసుకుంది. టూటౌన్ పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం..పట్టణంలోని హనుమాన్ నగర్‌కు చెందిన ఓబుది నర్సింలు (45) మంగళవారం రాత్రి మద్యం తాగి ఇంటికొచ్చి భార్యతో గొడవ పడ్డాడు. దీంతో భయాందోళనకు గురైన ఆమె పుట్టింటికి వెళ్లింది. బుధవారం ఉదయం నర్సింలు భార్యను ఇంటికి రావాలని కోరగా ససేమిరా అంది. దీంతో కోపోద్రిక్తుడైన నర్సింలు తన ద్విచక్రవాహనంలో ఉన్న పురుగుల మందు తాగాడు. వెంటనే అది గమనించిన కుటుంబసభ్యులు అతన్ని సిద్దిపేట ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు. ఈ క్రమంలోనే చికిత్స పొందుతూ బుధవారం సాయంత్రం నర్సింలు మృతిచెందాడు. మృతుడి కుమారుడు కనకరాజు ఫిర్యాదు మేరకు ఎస్‌ఐ కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు లిపారు.

ఓఎల్‌ఎంఎస్‌తో అక్రమాలకు చెక్

- నకిలీ, అనధికారిక విక్రయాలను నిలవరించడమే లక్ష్యం
- లైసెన్సుల రెన్యువల్ కూడా దీని ద్వారానే


గజ్వేల్‌లో ఎరువుల, విత్తన విక్రయాలు

గజ్వేల్: ఎరువులు, విత్తనాలు, పురుగు మందుల విక్రయాల్లో అక్రమాలను నివారించడానికి ప్రభుత్వం కొత్తగా ఓఎల్‌ఎంఎస్(ఆన్‌లైన్ లైసెన్స్ మేనేజ్‌మెంట్ సిస్టమ్) తీసుకొచ్చింది. వ్యాపారులు లైసెన్స్‌లు పొందడానికి, రెన్యూవల్‌తోపాటు విక్రయాలకు అధికారుల అనుమతి అంతా ఈ విధానం ద్వారానే జరగనుంది. నకిలీ, అనధికారిక అమ్మకాలకు చెక్ పెట్టేందుకే దీనిని అమలు చేస్తున్నారు. ప్రస్తుతం ఎరువులను కొత్త విధానంలోనే విక్రయిస్తుండగా విత్తనాలు, పురుగుమందులకు త్వరలోనే వర్తింప జేయనున్నారు. చాలా మంది వ్యాపారులు జీఎస్టీ సాకుతో రైతులకు బిల్లులు ఇవ్వకపోవడం పరిపాటిగా మారుతోంది. రైతులు పంట నష్టానికి గురయ్యే సందర్భాల్లో బిల్లులు లేక పరిహారం అందడం లేదు. మరోవైపు వ్యాపారులకు లైసెన్స్‌లిచ్చే విధానం సులువుగా లేకపోవడంతో వారు ఇబ్బందులు పడుతున్నారు. ఆన్‌లైన్ విధానం ద్వారా దీన్ని సరళతరం చేశారు. ఓఎల్‌ఎంఎస్ వెబ్‌సైట్‌లో దుకాణం పేరు, యాజమాని పేరు, లైసెన్స్ నెంబర్, ఇంటి నెంబర్, ఫోన్ నెంబర్, జీఎస్టీ తదితర వివరాలు నమోదవుతాయి. ఆ వివరాలను ఆన్‌లైన్‌లో చూసి అధికారులు ఆమోదిస్తారు. అభ్యంతరాలుంటే అమ్మకాలను నిలిపేస్తారు. ప్రతి వ్యాపారస్తుడికి ఒక లాగిన్ ఐడీ నెంబర్ ఇస్తారు. వ్యాపారులు తాము ఏ సంస్థ విత్తనాలు, పురుగుమందులు, ఎరువులు విక్రయిస్తారో పూర్తి వివరాలను నమోదు చేయాలి. ఓఎల్‌ఎంఎస్‌లో నమోదు చేసినవి కాకుండా, వేరే ఉత్పత్తులను, నకిలీలను విక్రయిస్తే అధికారులు చర్యలు చేపడతారు. ఫిర్యాదులు వస్తే ఆన్‌లైన్‌లో ఉన్న వివరాల అధారంగా అధికారులు దాడులు చేసి లైసెన్స్ రద్దు, కేసులు నమోదు చేసే అవకాశముంటుంది. ప్రస్తుతం ఎరువులకు ఈ విధానం అమల్లో ఉంది. త్వరలోనే విత్తనాలు, పురుగు మందులకు ఈ విధానం వర్తింపజేయనన్నారు.

వేర్వేరు రోడ్డు ప్రమాదాల్లో ఇద్దరి మృతి

పద్దెనిమిది మందికి గాయాలు

దివ్యాంగ యువకుడి మృతి


వెంకటేశ్(ఫైల్)

దుబ్బాక: రోడ్డు ప్రమాదంలో వికలాంగ యువకుడు మృతి చెందాడు. ఈ ఘటన ఇందూప్రియల్ గ్రామంలో జరిగింది. దౌల్తాబాద్ ఎస్‌ఐ చైతన్య రెడ్డి తెలిపిన వివరాలు ఇలా ఉన్నాయి. మండల పరిధిలోని ఇందూప్రియల్ గ్రామానికి చెందిన పోతురాజ్ వెంకటేశ్(34) వికలాంగుడు. తన మూడు చక్రాల బ్యాటరీ సైకిల్‌పై మంగళవారం అర్ధ రాత్రి సమయంలో గజ్వేల్ చేగుంట మార్గంలో వెళ్తుండగా గుర్తు తెలియని వాహనం ఢీకొని వెంకటేశ్ తలపై నుంచి వెళ్లడంతో తీవ్ర గాయాలై అక్కడికక్కడే మృతి చెందాడు. దీంతో స్థానికులు చూసి కుటుంబ సభ్యులకు, పోలీసులకు సమాచారం చేరవేశారు. పోలీసులు ఘటన స్థలానికి చేరకుని పంచనామ నిర్వహించి మృత దేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం గజ్వేల్ ప్రభుత్వ ఆసుపత్రికి తరలించినట్లు ఎస్‌ఐ తెలిపారు. మృతుడి భార్య రాజమని ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్‌ఐ తెలిపారు.

ఉద్యోగుల బస్సును ఢీ కొన్న ట్రావెల్ బస్సు

చేగుంట(తూప్రాన్): పరిశ్రమ ఉద్యోగులను తీసుకొస్తున్న బస్సును ట్రావెల్స్ బస్సు వెనుకనుంచి ఢీకొట్టిన ఘటనలో పదకొండు మందికి గాయాలయ్యాయి. ఈ సంఘటన చేగుంట శివారు జాతీయ రహదారిపై బుధవారం చోటు చేసుకుంది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. చిన్నశంకరంపేట మండలం చందంపేట ఎంఎస్ఎన్ పరిశ్రమకు 25 మంది ఉద్యోగులను తీసుకొని కామారెడ్డి నుంచి వస్తుంది. ఈ క్రమంలో చేగుంట శివారులో యూటర్న్ తీసుకుంటున్న పరిశ్రమ బస్సును ట్రావెల్స్‌బస్సు వెనుకనుంచి ఢీకొట్టగా ఉద్యోగుల బస్సు పడిపోయింది. ఈ ప్రమాదంలో రవిశంకర్‌రెడ్డి చేతికి తీవ్ర గాయాలు కాగా మరో 10 మందికి స్వల్ప గాయాలయ్యాయి. గాయాలైన వారందరిని చికిత్స నిమిత్తం సికింద్రాబాద్‌కు తరలించారు. ట్రావెల్స్ బస్సు డ్రైవర్‌పై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్‌ఐ ప్రకాశ్‌గౌడ్ తెలిపారు.


చేగుంట: పడిపోయిన ఉద్యోగుల బస్సు

కారు ఢీ కొని..

సంగారెడ్డి మున్సిపాలిటీ: కారు ఢీ కొని వ్యక్తి మృతి చెందిన సంఘటన బుధవారం చౌటకూరు మండలం సరాఫ్ పల్లి వద్ద చోటుచేసుకుంది. ఎస్‌ఐ విజయ్ కుమార్ తెలిపిన వివరాల ప్రకారం..షాపూర్ నగర్ జీడిమెట్లకు చెందిన నరసింహారావు బాన్సువాడ నుంచి హైదరాబాద్‌కు అల్లుడు కోనెకోటి గోవిందరాజు కారులో వస్తుండగా బుధవారం చౌటకూరు మండలం సరాఫ్ పల్లి గ్రామ శివారులో రాంగ్ రూట్లో వచ్చిన లారీని ఢీక్కొట్టాడు. దీంతో నరసింహారావు అక్కడికక్కడే మృతి చెందాడు. తన అల్లుడు గోవిందరాజుకు రెండు కాళ్లకు గాయాలయ్యాయి. గోవిందరాజును చికిత్స నిమిత్తం హైదరాబాద్ తరలించినట్లు తెలిపారు. కుటుంబీకుల ఫిర్యాదు మేరకు ఎస్‌ఐ కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్లు తెలిపారు.

ఆటో బోల్తా.. ఏడుగురికి గాయాలు

మెదక్ మున్సిపాలిటీ: మున్సిపాలిటీకి సంబంధించిన ట్రాలీ ఆటో బోల్తా పడిన ఘటనలో ఏడుగురికి గాయాలయ్యాయి. ఇద్దరి పరిస్థితి విషమంగా ఉంది. ఈ సంఘటన ఆలస్యంగా వెలుగులోకి వచ్చింది. మెదక్ మున్సిపాలిటీకి సంబంధించిన కార్మికులు పట్టణ శివారునుంచి రాజ్‌పల్లి వరకూ హరిత హారం మొక్కలు నాటుతున్నారు. ఇందులో భాగంగా మంగళవారం మెదక్ పట్టణంలోని చిల్డ్రన్స్‌పార్క్‌లో గల నర్సరీ నుంచి మొక్కలు తీసుకొని వెళ్తున్న ట్రాలీ ఆటో పిల్లికోటాల్ దాటిన తరువాత బోల్తా పడింది. ఈ ఘటనలో ఏడుగురికి గాయాలయ్యాయి. క్షతగాత్రులను స్థానికులు మెదక్ ఏరియా ఆస్పత్రికి తరలించారు. అనంతరం మున్సిపల్ చైర్మన్‌చంద్రపాల్ వారిని పరామర్శించారు. కాగా డ్రైవర్ సిద్దిరాంలు, డంక భాస్కర్ పరిస్థితి విషమంగా ఉండటంతో వారిని హైదరాబాద్‌లోని గాంధీ ఆస్పత్రికి తరలించారన్నారు.

మక్కలలోడు దగ్ధం


ముందుభాగం కాలిన డీసీఎం వ్యాను

చేగుంట(తూప్రాన్): మక్కల లోడు దగ్ధమైన సంఘటన మాసాయిపేట శివారులో బుధవారం సాయంత్రం చోటు చేసుకుంది. స్థానికులు తెలిపిన వివరాల ప్రకరారం..నిజామాబాద్ జిల్లా గాంధారి మండలం గుజ్జాల్ తండానుంచి 8టన్నుల మొక్కజొన్నలు తూప్రాన్ మండలం శభాష్‌పల్లి సుగుణ కోళ్ల దాణ పరిశ్రమకు తరలిస్తున్నారు. మొక్కజొన్న తేమశాతం అధికంగా ఉండటంతో పరిశ్రమ నిర్వాహకులు తీసుకోలేదు. తిరిగి చేగుంట శివారులోని వెంకటేశ్వర హెచరీస్ కోళ్లదానా పరిశ్రమలో అమ్మడానికి తీసుకెళ్తుండగా మాసాయిపేట వద్దకు రాగానే డీసీఎం క్యాబిన్‌లో మంటలు చెలరేగాయి. గమనించిన డ్రైవర్ బుచ్చిరాం రాజు నాయక్ రోడ్డుపక్కకు డీసీఎం నిలిపేసి కిందికి దూకాడు. గ్రామస్తులు మంటలను ఆర్పగా వెనుకాల ఉన్న మొక్కజొన్నలు కాలిపోయాయి. ప్రమాదంలో రూ. 4లక్షల వరకు నష్టం వాటిల్లినట్లు డ్రైవర్ తెలిపాడు.

అదృశ్యమైన ఇంటర్ విద్యార్థిని ఆచూకీ లభ్యం


భవానిని సోదరుడు గణేశ్‌కు అప్పగిస్తున్న బీడీఎల్ పోలీసులు

పటాన్‌చెరు టౌన్: అదృశ్యమైన ఇంటర్ విద్యార్థిని ఆచూకీ తెలుసుకొని సోదరుడికి అప్పగించిన సంఘటన బీడీఎల్ పోలీస్ స్టేషన్ పరిధిలో చోటుచేసుకుంది. ఎస్‌ఐ సాయిలు వివరాల ప్రకారం..పటాన్‌చెరు మండలం పాటి గ్రామానికి చెందిన భవాని మంగళవారం ఇంటర్మీడియట్ ఫలితాల్లో అన్ని సబ్జెక్టులో ఫెయిల్ అయింది. ఈ విషయంలో ఇంట్లో తిడతారని భయపడి ఎవరికీ చెప్పకుండా వెళ్లిపోయింది. దీంతో సోదరుడు గణేశ్ చెల్లి అదృశ్యంపై ఫిర్యాదు చేయడంతో పోలీసులు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేశారు. బుధవారం అదృశ్యమైన భవాని హైదరాబాద్‌లోని స్నేహితురాలి వద్ద ఉన్నట్లు పోలీసులు గుర్తించారు. అక్కడినుంచి భవానిని తీసుకొచ్చి సోదరుడు గణేశ్‌కు అప్పగించారు. అన్ని సబ్జెక్టులు ఫెయిల్ కావడంతో తిడతారని భయంతో స్నేహితురాలి వద్దకు వెళ్లినట్లు భవాని పోలీసులకు తెలిపింది.

ధాన్యం కొనుగోలు కేంద్రం వద్ద ఇష్టారాజ్యం

ప్రశ్నిస్తే రైతులపై దాడులు

మనోహరాబాద్(తూప్రాన్): ధాన్యం కొనుగోలు కేంద్రం వద్ద తమకు నచ్చిన వారిదే కొనుగోలు చేస్తున్నారని ప్రశ్నించిన రైతులపై దాడులకు దిగుతున్నారని ఆందోళన చేపట్టిన సంఘటన మనోహరాబాద్ మండలం దండుపల్లి పీఏసీఎస్ కొనుగోలు కేంద్రం వద్ద బుధవారం చోటు చేసుకుంది. దండుపల్లికి చెందిన రైతు నాగయ్య, కోనాయపల్లి(పీటి)కి చెందిన రైతు మల్లేశ్‌లు ధాన్యం కొనుగోలు కేంద్రం వద్ద వడ్లను 6 రోజుల క్రితం ఆరబోశారు. వాటికి ఓటిపి చేయించారు. కానీ వాటిని తీసుకోవడం లేదని వారు పేర్కొన్నారు. ఈ విషయమై వ్యవసాయ అధికారులకు సమాచార మిచ్చినట్లు తెలిపారు. ఈ విషయంపై వ్యవసాయ అధికారి నిర్వాహకుడు రమేశ్‌తో మాట్లాడి రైతులకు సమస్యలు కలిగించొద్దని సూచించి వెళ్లిపోయారు. కాగా సాయంత్రం రమేశ్ రైతు మల్లేశ్‌పై దాడి చేసినట్లు తెలిపారు. దీంతో బాధిత రైతులు పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. ఈ విషయంలో నిర్వాహకుడు రమేశ్‌ను వివరణ కోరగా నిబంధనల మేరకు ఆరబోసిన ధాన్యాన్ని కొనుగోలు చేస్తామన్నారు.

విద్యుదాఘాతంతో ట్యాంకర్ డ్రైవర్ మృతి

పటాన్‌చెరు టౌన్: విద్యుదాఘాతానికి గురై ట్యాంకర్ డ్రైవర్ మృతిచెందిన సంఘటన పటాన్‌చెరు పోలీస్ స్టేషన్ పరిధిలో చోటుచేసుకుంది. ఎస్‌ఐ ప్రసాద్ రావు వివరాల ప్రకారం..మహారాష్ట్ర, నాందేడ్ జిల్లాలోని చైనాపూర్ గ్రామానికి చెందిన ఎల్లప్ప(30) భార్య విజయమాలతో బతుకుదెరువు కోసం వచ్చి బండ్లగూడలో నివాసం ఉంటున్నాడు. ఈ క్రమంలో బండ్లగూడకు చెందిన నందకిషోర్ వద్ద నీటిట్యాంకర్ డ్రైవర్‌గా పనిచేస్తున్నాడు. మంగళవారం వెంచర్ వద్ద నీటిని ట్యాంకర్‌లో నింపే క్రమంలో విద్యుత్ వైర్ తగిలి కిందపడ్డాడు. దీంతో చికిత్స నిమిత్తం బీరంగూడలోని ఓ ప్రైవేట్ ఆసుపత్రికి తరలించారు. అక్కడ పరిశీలించిన వైద్యులు అప్పటికే మృతిచెందినట్లు వెల్లడించారు. సమాచారం తెలుసుకున్న పోలీసులు మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం పటాన్‌చెరు ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. పోలీసులు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నారన్నారు.

వడదెబ్బతో రైతు..


కాశయ్య (ఫైల్)

పాపన్నపేట(మెదక్): వడ దెబ్బతో ఓ రైతు మృతి చెందిన సంఘటన పాపన్నపేటలో చోటు చేసుకుంది. కుటుంబ సభ్యులు తెలిపిన వివరాల ప్రకారం.. గ్రామానికి చెందిన బెస్త భూపతి కాశయ్య(60)చేపలు పట్టడంతో పాటు వ్యవసాయం చేసుకుంటు జీవనం సాగిస్తున్నాడు. వరి పంట చేతికి రావడంతో కోత మిషన్ కోసం రెండు రోజులుగా పొలం వద్ద ఎదురు చూశాడు. బుధవారం పొలం గట్టుపై నడుస్తూ క్రింద పడి పోయాడు. తోటి రైతులు చూసి అతని కుటుంబీకులకు సమాచారం ఇచ్చారు. వారు అక్కడి వచ్చి చూసేసరికి కాశయ్య మృతి చెందినట్టు గుర్తించారు. వడ దెబ్బతో మృతి చెంది ఉంటాడని కుటుంబీకులు తెలిపారు.

మల్లన్న సాగర్‌లో పడి యువకుడు..


రమేశ్ మృతదేహం

తొగుట(దుబ్బాక): మల్లన్న సాగర్ చూసేందుకు వెళ్లి ప్రమాదవశాత్తు నీటిలో పడి మృతిచెందిన సంఘటన బుధవారం చోటుచేసుకుంది. తొగుట ఎస్‌ఐ కర్ణాకర్‌రెడ్డి తెలిపిని వివరాల ప్రకారం..మల్లన్న సాగర్ నిర్వాసిత గ్రామం పల్లే పహడ్‌కి చెందిన కొమ్ము రమేశ్(30) అదే గ్రామానికి చెందిన స్నేహితులు గొడుగు సాయిలు, సింగరమైన కనకయ్యలతో కలిసి మంగళవారం మధ్యాహ్నం మల్లన్న సాగర్‌కు వచ్చారు. సాయిలు, కనకయ్యలు చేపలు పట్టేందుకు తెప్పలతో రిజర్వాయర్‌లోకి వెళ్లారు. వారు తిరిగి ఒడ్డుకు వచ్చి చూసేసరికి రమేశ్ కనిపించలేదు. ఎంతసేపు ఆయన ఆచూకీ కోసం గాలించిన ఫలితం లేదు. దీంతో ఆందోళనకు గురైన స్నేహితులు రమేశ్ అన్న కొమ్ము కిష్టయ్యకు ఫోన్‌చేసి సమాచారం చేరవేశారు. అక్కడికి వచ్చిన కుటుంబీకులు ఆచూకీ కోసం చుట్టుపక్కల గాలించిన అతని జాడ కనిపించలేదు. దీంతో మంగళవారం రాత్రి తొగుట పోలీస్ స్టేషన్‌లో కుటుంబ సభ్యులు ఫిర్యాదు చేశారు. బుధవారం పోలీసులు మృతదేహం కోసం రిజర్వాయర్‌లో గజఈతగాళ్లతో వెతికించగా మృతదేహం లభ్యమైనట్టు ఎస్‌ఐ పేర్కొన్నారు. మృతదేహాన్ని పోస్టు మార్టం నిమిత్తం సిద్దిపేట ప్రభుత్వ ఆసుపత్రికి తరలించి కేసునమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్టు ఎస్‌ఐ చెప్పారు.

చెరువులో పడి మహిళ..

పాపన్నపేట(మెదక్): ప్రమాదవశాత్తు చెరువులో పడి ఓ మహిళ మృతి చెందిన సంఘటన మిన్‌పూర్‌లో చోటు చేసుకుంది. పాపన్నపేట ఎస్‌ఐ విజయ్‌నారాయణ్ తెలిపిన వివరాల ప్రకారం..గ్రామానికి చెందిన జంగం మల్లమ్మ(60) చేపలు అమ్ముకుంటూ జీవనం కొనసాగిస్తుంది. బుధవారం బట్టలు ఉతికేందుకు ఊరు చివరన ఉన్న చెరువులోకి వెళ్లింది. అక్కడ ఆమె బట్టలు ఉతికే క్రమంలో ప్రమాదవశాత్తు నీటిలో పడి మృతి చెందింది. అటుగా వెళ్లిన స్థానికులు అది గమనించి కుటుంబ సభ్యులకు సమాచారం చేరవేశారు. దీంతో స్థానికుల సహకారంతో మృత దేహాన్ని బయటకు తీశారు. కొడుకు గంగారాం ఫిర్యాదు మేరకు ఎస్‌ఐ కేసు నమోదు చేసుకొని పోస్టు మార్టం నిమిత్తం మెదక్ ఏరియా ఆస్పత్రికి తరలించారన్నారు.

రేకుల షెడ్డు కూలి పాడి పశువు మృతి


మృతి చెందిన పాడి పశువుతో సమ్మయ్య

హుస్నాబాద్‌రూరల్: ప్రమాదవశాత్తు పాడి పశువు మృతి చెందింది. వివరాలు ఇలా ఉన్నాయి..హుస్నాబాద్ మండలం బంటుపల్లెకు చెందిన బంటు సమ్మయ్య పాడి పశువును రోజు మాదిరిగానే రేకుల షెడ్డుకింద కట్టేశాడు. మంగళవారం రాత్రి కురిసిన గాలి వానకు రేకుల షెడ్డు కూలి పశువు మరణించిందని రైతు బుధవారం తెలిపాడు. 20 లీటర్ల పాలు ఇచ్చే పశువు మృతి చెందడంతో రైతుకు రూ.80వేల వరకూ ఆర్థిక నష్టం జరిగిందని బోరున విలపించాడు.

కుక్కల దాడి..

10మందికి గాయాలు

గజ్వేల్‌రూరల్: వీధి కుక్కల స్వైర విహారంతో 10మందికి గాయాలైన సంఘటన ధర్మారెడ్డిపల్లిలో చోటు చేసుకుంది. బుధవారం గ్రామస్తులు తెలిపిన వివరాల ప్రకారం..గ్రామానికి చెందిన గండిగారి సత్యనారాయణ తన ఇంటిముందు వరండాలో పడుకొని ఉండగా వీధి కుక్కలు కరిచినట్లు చెప్పారు. ఈ క్రమంలోనే మరో 10మందిని గాయపరిచినట్లు స్థానికులు తెలిపారు.

నాన్ బెయిలబుల్ వారెంట్ త్వరగా ఎగ్జిక్యూట్ చేయాలి

ఎస్పీ రోహిణీప్రియదర్శిని


కోర్టు కానిస్టేబుళ్లను సన్మానిస్తున్న ఎస్పీ రోహిణీప్రియదర్శిని

మెదక్ మున్సిపాలిటీ: నాన్ బెయిలబుల్ వారెంట్ త్వరగా ఎగ్జిక్యూట్ చేయాలని, మహిళలు, పిల్లల రక్షణ విషయంలో ప్రత్యేక దృష్టి సారించాలని ఎస్పీ రోహిణి ప్రియదర్శిని సూచించారు. బుధవారం జిల్లా పోలీస్ ప్రధాన కార్యాలయంలో ఆమె సమీక్షా సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా పాపన్నపేట, టెక్మాల్ పోలీస్ స్టేషన్ కేసులలో నేరస్తులకు శిక్షలు పడే విధంగా కృషి చేసిన పబ్లిక్ ప్రాసిక్యూటర్ షేక్ ఫజల్ అహ్మద్, అదనపు పిపి ప్రభుదాన్యం, కోర్టు లైజనింగ్, కానిస్టేబుళ్లు, ఎస్‌ఐ విఠల్, లైజనింగ్ ఆఫీసర్ రవీందర్ గౌడ్, కోర్టు కానిస్టేబుల్ మధు, కానిస్టేబుల్ కృష్ణ గౌడ్‌లను శాలువా కప్పి సత్కరించారు. ఈ సందర్భంగా ఎస్పీ రోహిణి మాట్లాడారు. భవిష్యత్‌లో కూడా నేరస్తులకు శిక్షలు పడే విధంగా కృషి చేయాలన్నారు. బాధితులకు పోలీసులపై నమ్మకం కలిగించే విధంగా నడుచుకోవాలన్నారు. కేసుల ఛేదనలో అత్యాధునిక టెక్నాలజీ ఉపయోగించాలన్నారు. కోర్టు డ్యూటీ ఆఫీసర్ విధులు నిర్వహించే అధికారులకు సిబ్బందికి తరచుగా శిక్షణ తరగతులు నిర్వహించాలన్నారు. నాన్ బెయిలబుల్ వారెంట్ త్వరగా ఎగ్జిక్యూట్ చేయాలన్నారు. ఈ సమావేశంలో మెదక్ డీఎస్పీ సైదులు, తూప్రాన్ డీఎస్పీ యాదగిరిరెడ్డి, ఆర్ఐ నాగేశ్వర్‌రావు, అచ్యుత రావు, ఎస్బీసీఐ దిలీప్‌కుమార్ సిబ్బంది పాల్గొన్నారు.

ఆరుగురి అదృశ్యం

వేర్వేరు ఘటనల్లో ఆరుగురు అదృశ్యమయ్యారు. కుటుంబ సభ్యులు పోలీస్‌స్టేషన్లలో ఫిర్యాదు చేశారు.

తల్లీతో సహా ఇద్దరు పిల్లలు..


జ్యోతి (ఫైల్)

పటాన్‌చెరు టౌన్: తల్లీతో సహా ఇద్దరు పిల్లలు అదృశ్యమైన సంఘటన పటాన్‌చెరు పోలీస్ స్టేషన్ పరిధిలో చోటుచేసుకుంది. ఎస్‌ఐ దుర్గయ్య కథనం ప్రకారం..పటాన్‌చెరు మండలం ఇంద్రేశం గ్రామానికి చెందిన సుధాకర్ ఓ ప్రైవేట్ కంపెనీలో పనిచేసుకుంటూ జీవనం సాగిస్తున్నాడు. ఈ నెల 7వ తేదీన భార్య జ్యోతితో గొడవ పడ్డాడు. రోజుమాదిరిగా సుధాకర్ డ్యూటీకి వెళ్లగా సాయంత్రం ఇంటికొచ్చి చూసే సరికి భార్య జ్యోతితో పాటు తొమ్మిది సంవత్సరాల కూతురు సుజాత, ఆరు సంవత్సరాల అక్షిత కనిపించేదు. దీంతో భారా, పిల్లల కోసం తెలిసిన వారి వద్ద, బంధువుల వద్ద వెతికినా ఆచూకి లభిందలేదు. భర్త సుధాకర్ ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నారు.

హెచ్‌ఆర్ మేనేజర్..


ఆనంద్ కుమార్ (ఫైల్)

పెన్నార్ ఇండస్ట్రీస్ కంపెనీలో హెచ్‌ఆర్ మేనేజర్ అదృశ్యమైన సంఘటన పటాన్‌చెరు పోలీస్ స్టేషన్ పరిధిలో చోటుచేసుకుంది. పోలీసుల కథనం ప్రకారం..సంగారెడ్డి పట్టణానికి చెందిన ఆనంద్ కుమార్ పటాన్‌చెరు మండలం లక్డారం సమీపంలోని పెన్నార్ కంపెనీలో హెచ్‌ఆర్ మేనేజర్‌గా విధులు నిర్వహిస్తున్నాడు. ఈ క్రమంలో మంగళవారం మధ్యాహ్నం విధులు ముగించుకొని స్కూటీపై బయటకు వచ్చిన ఆనంద్ కుమార్ ఇంటికి వెళ్లలేదు. దీంతో కుటుంబ సభ్యులు తెలిసిన వారి వద్ద బంధువుల వద్ద వెతికినా ఆచూకీ లభిందలేదు. ఈ విషయంపై భార్య పోలీసులకు ఫిర్యాదు చేసింది.

సెక్యూరిటీగార్డు కూతురు..

సెక్యూరిటీగార్డు కూతురు అదృశ్యమైన సంఘటన పటాన్‌చెరు పోలీస్ స్టేషన్ పరిధిలో చోటుచేసుకుంది. ఎస్‌ఐ ప్రసాద్ రావు కథనం ప్రకారం..పటాన్‌చెరు మండలం ఇస్నాపూర్‌కు చెందిన టేక్‌నాథ్ శర్మ సెక్యూరిటీగార్డుగా పనిచేసుకుంటు జీవనం సాగిస్తున్నాడు. కాగా అతడి రెండో కూతురు మనీషా నేపాల్ నుంచి తన కుమారుడు యమన్‌తో నెల రోజల క్రితం వచ్చి తండ్రి వద్ద ఉంటుంది. ఈ క్రమంలో ఈ నెల 5వ తేదీన మనీషా ఇంట్లో ఎవరికీ చెప్పకుండా ఇంటి నుంచి వెళ్లిపోయింది. మనీషా తండ్రి టేక్‌నాథ్ శర్మ కూతురి కోసం చుట్టు పక్కల వెతికినా ఆచూకీ లభిందలేదు. దీంతో కూతురి అదృశ్యంపై తండ్రి ఫిర్యాదు చేయగా పోలీసులు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నారన్నారు.

జిన్నారంలో..


పాండు (ఫైల్)

జిన్నారం(పటాన్‌చెరు): కూలీ పనికని ఇంటినుంచి వెళ్లిన వ్యక్తి తిరిగి రాలేదు. ఎస్‌ఐ విజయకృష్ణ తెలిపిన వివరాల ప్రకారం..గుమ్మడిదల గ్రామానికి చెందిన జగ్గంపేట పాండు(38) కూలీ పని చేస్తూ జీవనాన్ని సాగిస్తుంటాడు. ఈ నెల 8న పనికని వెళ్లిన పాండు ఇంటికి తిరిగి రాలేదు. దీంతో కుటుంబ సభ్యులు బంధువుల వద్ద ఆరా తీశారు. ఎంతకీ ఆచూకీ తెలియకపోవడంతో కుటుంబ సభ్యులు పోలీసులకు ఫిర్యాదు చేశారు. ఎస్‌ఐ కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తునట్లు తెలిపారు.

వేర్వేరు ఘటనల్లో ఇద్దరి ఆత్మహత్య

భార్య పుట్టింటికి వెళ్లిందని..

పటాన్‌చెరు టౌన్: కుటుంబ కలహాలతో భార్య గొడవపడి పుట్టింటికి వెళ్లిందని మనస్థాపంతో భర్త ఆత్మహత్య చేసుకున్న సంఘటన పటాన్‌చెరు పోలీస్ స్టేషన్ పరిధిలో చోటుచేసుకుంది. ఎస్‌ఐ రామనాయుడు తెలిపిన వివరాల ప్రకారం..ఆంధ్రప్రదేశ్‌లోని శ్రీకాకుళానికి చెందిన బెజ్జాపురం మధు(32) బతుకుదెరువు కోసం వచ్చి ఇస్నాపూర్‌లో నివాసం ఉంటున్నారు. పాశమైలారం పారిశ్రామికవాడలో ఓ ప్రైవేట్ కంపెనీలో పనిచేస్తూ జీవనం సాగిస్తున్నాడు. ఈ క్రమంలో భార్యభర్తల మధ్య గొడవ జరగడంతో భార్య పుట్టింటికి వెళ్లింది. మనస్థాపానికి గురైన మధు మంగళవారం రాత్రి ఇంట్లో ఆత్మహత్య చేసుకున్నాడు. సమాచారం తెలుసుకున్న పోలీసులు ఘటన స్థలానికి చేరుకొని మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం పటాన్‌చెరు ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. మృతుడి సోదరుడు భార్గవ్ ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నారు.

భార్యపై కోపంతో..

కొల్చారం(నర్సాపూర్): భార్యపై కోపంతో భర్త ఆత్మహత్యకు పాల్పడిన సంఘటన అప్పాజీ పల్లి గ్రామంలో బుధవారం ఉదయం చోటుచేసుకుంది. మృతుని భార్య రేణుక, ఎస్‌ఐ శ్రీనివాస్ గౌడ్ తెలిపిన వివరాల ప్రకారం.. మృతుడు కన్నెబోయిన ఏగొండ(41) వ్యవసాయంతో పాటు కూలీ పని చేస్తూ జీవనం సాగిస్తున్నట్లు తెలిపారు. వ్యవసాయ పనులు లేకపోవడంతో తన భర్తను ఉపాధి హామీ పనులకు వెళ్లాలని రెండు రోజుల క్రితం మందలించిందన్నారు. దీంతో అతను కోపంతో రేణుకను కొట్టినట్లు తెలిపారు. అప్పటినుంచి ఆమె ఇంట్లో భోజనం చేయకుండా, ఇంటి ముందు ఆరుబయట నిద్రిస్తున్నట్లు తెలిపారు. ఎప్పటిలాగే మంగళవారం రాత్రి 10 గంటల ప్రాంతంలో ఆమె ఇద్దరు పిల్లలతో ఇంట్లో నిద్రించింది. భర్త ఇంటి ఆరుబయట పడుకున్నాడని చెప్పింది. ఉదయం 6 గంటల ప్రాంతంలో సర్పంచ్ భర్త ఫోన్ చేసి ఏగొండ గ్రామంలోని పాఠశాల పక్కన వేప చెట్టుకు ఉరివేసుకొని ఉన్నాడని సమాచారం ఇచ్చాడన్నారు. దీంతో అక్కడికి వెళ్లి చూడగా అప్పటికే ఏగొండ చనిపోయినట్లు తెలిపారు. భార్య రేణుక ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకుని మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం మెదక్ ఏరియ ఆసుపత్రికి తరలించారన్నారు. కేసు దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్‌ఐ తెలిపారు.

ఇంటర్ విద్యార్థిని..

కొండపాక(గజ్వేల్): ఇంటర్మీడియట్ ఫలితాల్లో ఫెయిల్ అయ్యానని మనస్తాపానికి గురై విద్యార్థినీ తేలు అశ్విని(17) ఆత్మ హత్యా యత్నానికి పాల్పడిన సంఘటన కొండపాకలో చోటు చేసుకుంది. వివరాలు ఇలా ఉన్నాయి..కొండపాకకు చెందిన తేలు అశ్విని మంగళవారం ప్రకటించిన ఫలితాల్లో ఫెయిల్ అయ్యింది. దీంతో మనస్తాపానికి గురై పురుగుల మందు సేవించి ఆత్మ హత్యా యత్నానికి పాల్పడింది. దీన్ని గమనించిన కుటుంబీకులు వెంటనే ఆమెను సిద్దిపేట ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు.

కుటుంబ కలహాలతో ఆత్మహత్యాయత్నం


చికిత్స పొందుతున్న కొమురయ్య

అక్కన్నపేట(హుస్నాబాద్): కుటుంబ కలహాలతో ఓ వ్యక్తి ఆత్మహత్యకు యత్నించిన ఘటన అక్కన్నపేట మండలం కుందనవానిపల్లి గ్రామంలో మంగళవారం రాత్రి చోటుచేసుకుంది. వివరాలు ఇలా ఉన్నాయి..గ్రామానికి చెందిన కన్నం కొమురయ్య(48)కుటుంబ కలహాలతో పురుగుల మందు సేవించాడు. ఆ సమయంలో పెట్రోలింగ్ చేస్తున్న హెడ్‌కానిస్టేబుల్ కృష్ణ, కానిస్టేబుల్ యాదగిరి విషయం తెలుసుకొని హుటాహుటిన తమ పెట్రోలింగ్ వాహనంలో ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. వారు సకాలంలో ఆసుపత్రికి తీసుకెళ్లి చికిత్స చేయించడంతో ప్రాణపాయస్థితి తప్పిందని వైద్యులు పేర్కొన్నారు. పోలీసులు చూపిన మానవత్వానికి గ్రామ ప్రజలు కృతజ్ఞతలు తెలిపారు. ఇద్దరు కానిస్టేబుళ్లను ఏసీపీ వాసాల సతీశ్ అభినందించారు.